సాక్షి
తూర్పుగోదావరి
బుధవారం, 20, డిసెంబర్, 2023



22న మండపేటలో సామాజిక సాధికార బస్సు యాత్ర

వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సు యాత్ర ఈ నెల 22న మండపేటలో జరగనుంది. - 8లో



సుదర్శన హోమానికి విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నారసింహ సుదర్శన హోమానికి ఎస్‌వీ శ్రీధర్ (బెంగళూరు) మంగళవారం రూ.లక్ష విరాళం అందించారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు మంగళవారం 10,100 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,100, మధ్య డెల్టాకు 1,000, పశ్చిమ డెల్టాకు 6,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

21, 22, 23 తేదీల్లో దివ్యాంగులకు శిబిరాలు

భరత్‌రామ్, ఎంపీ



రాజమహేంద్రవరం రూరల్: జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అలిమ్‌కో (హైదరాబాద్) సంస్థ సహకారంతో దివ్యాంగుల ఉపకరణాల మంజూరు గుర్తింపు శిబిరాలను ఈనెల 21, 22, 23 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈనెల 21న రాజమహేంద్రవరం వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో, 22న అనపర్తి ఎంపీడీవో కార్యాలయంలో, 23న గోపాలపురం ఎంపీడీవో కార్యాలయంలో శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆయా నియోజకవర్గాల పరిధిలోని అవసరార్థులు ఈ శిబిరాలకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సదరమ్ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ లేదా ఓటరు కార్డు, ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు తెచ్చుకోవాలన్నారు. మూడు చక్రాల సైకిళ్లు, వీల్ చైర్లు, చంక కర్రలు, కృత్రిమ కాళ్లు, కాలిపర్లు, రోలేటర్లు, చెవి మెషీన్లు, వాకింగ్ స్టిక్కులు, మానసిక ప్రతిభావంత పిల్లలకు ఎంఎస్ఐఈడీ కిట్లు, లెప్రసీ బాధితులకు ఏడీఎల్ కిట్, సీపీ చైర్ బ్యాటరీ ఆపరేటెడ్ మూడు చక్రాల సైకిళ్లు ఇచ్చేందుకు లబ్ధిదారుల గుర్తింపు జరుగుతుందన్నారు.

రేపు నన్నయలో మెగా జాబ్ మేళా



జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

రాజానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజైన గురువారం ఆదికవి నన్నయ యూనివర్సిటీలో మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్టు స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ సహకారంతో వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ ఆధ్వర్యంలో జరిగే ఈ మేళాలో సుమారు 30 ప్రముఖ కంపెనీలు, సంస్థల ద్వారా మూడు వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో ఇంటింటికీ వెళ్లిన సమయంలో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లల ఉపాధి గురించి చేసిన విజ్ఞప్తుల నేపథ్యంలో ఈ మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకూ చదువుకున్న అభ్యర్థులు ఆ రోజు ఉదయం 9 గంటలకే యూనివర్సిటీ ప్రాంగణానికి చేరుకోవాలన్నారు. మేళాకు వచ్చే అభ్యర్థులకు, వారి వెంట వచ్చే వారికి భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు.

అమంగళాలను తొలగించే రామపాదం : సామవేదం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గౌతముని శాపం వలన ఎవరికీ కనపడకుండా 'శిల వలె' ఆశ్రమంలో పడి ఉన్న అహల్య ఆశ్రమంలోకి శ్రీరాముడు ప్రవేశించగానే ఆమెకు శాపవిముక్తి కలిగింది.. ఆమెకు తపస్సిద్ధి కలిగిందని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. మంగళవారం హిందూ సమాజంలో ఆయన సప్తమ దివస ప్రవచనాన్ని కొనసాగించారు. తాటక వధతో మహారణ్యంగా మారిన అడవి జనావాసంగా మారింది.. రాముడు ఆశ్రమంలోకి ప్రవేశించగానే అహల్య శాపవిముక్తురాలయింది.. అమంగళాలను తొలగించేది రామపాదమని సామవేదం అన్నారు. అహల్యాగౌతముల పుత్రుడు శతానందుడు జనకునికి పురోహితుడు. ఆతిథ్యం భార్యాభర్తలు ఇరువురూ కలసి ఇవ్వాలి, అహల్యాశాపవిముక్తి కాగానే ఆమె భర్త గౌతముడు అక్కడికి వచ్చాడు, భార్యాభర్తలు తిరిగి కలిశారు. జనకుని యాగానికి విశ్వామిత్రుని వెంట రామలక్ష్మణులు వచ్చారు. యజ్ఞసభలో రాముడు శివ ధనుర్భంగం చేశాడు, స్వయంవరంలో కాదు, అక్కడికి రావణుడు రావడం సినిమాల సృష్టి, రావణుడు అక్కడికి రావడం వాల్మీకి చెప్పినది కాదన్నారు. సీతారాముల కల్యాణ వృత్తాన్ని ఆయన రసవత్తరంగా వర్ణించారు. వాల్మీకి శ్లోకాలతో పాటు, కవిసమ్రాట్ విశ్వనాథ కల్పవృక్షంలోని పద్యాలను ఆయన భావయుక్తంగా వివరించారు. వచ్చే నెల 22వ తేదీన అయోధ్యలో జరగనున్న సీతారామలక్ష్మణుల విగ్రహప్రతిష్ఠా మహోత్సవానికి సామవేదం షణ్ముఖ శర్మ ఆహ్వానం అందుకున్నారు.

కొవ్వూరు సబ్ కలెక్టరుగా అశుతోష్ శ్రీవాత్సవ

కొవ్వూరు: కొవ్వూరు సబ్ కలెక్టరుగా అశుతోష్ శ్రీవాత్సవ నియమితులయ్యారు. ప్రభుత్వం మంగళవారం రాత్రి ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. సుదీర్ఘ విరామం తర్వాత ఐఏఎస్ అధికారి నియమితులయ్యారు. ఇక్కడ ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ ఆర్డీవోగా రాజమహేంద్రవరం కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామావత్ కృష్ణ నాయక్ పనిచేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్.మల్లిబాబును డిప్యూటీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌గా బదిలీ చేయడంతో ఇక్కడ పోస్టు ఖాళీ అయ్యింది.

కష్ట సమయంలో కొండంత అండ

- తుపాను పంట నష్టం లెక్కలు పూర్తి
- ఆగమేఘాలపై ఆర్బీకేలలో రైతుల జాబితా
- సంక్రాంతిలోగా సాయం అందించేందుకు సన్నాహాలు
- రూ.21.46 కోట్ల పరిహారం చెల్లింపునకు రంగం సిద్ధం
- పాడి రైతులకు ఉచితంగా పశు గ్రాసం పంపిణీ



రంగంపేట మండలంలో రైతులకు ఎనభై శాతం సబ్సిడీపై శనగ విత్తనాలను రైతులకు అందజేస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు(ఫైల్)

కొవ్వూరు: మిచాంగ్ తుపాను వల్ల వాటిల్లిన నష్టం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత వేగంగా స్పందించింది. నెల తిరగకుండానే దెబ్బతిన్న పంటల లెక్క తేల్చింది. ఈ మేరకు రైతుల ఖాతాల్లో నష్ట పరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) జమ చేసేందుకు సన్నద్ధమయ్యింది. తుపాను తెరపిచ్చిన వెంటనే అధికారులు పంట నష్టం అంచనాల తయారీలో తలమునకలయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్దేశ గడువు లోగానే లెక్కల ప్రక్రియ పూర్తి చేయడంలో సఫలీకృతమయ్యారు. జిల్లాలో 33 శాతం పైబడి సుమారు 14,474.17 వేల హెక్టార్లలో వ్యవసాయ,ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. వ్యవసాయ శాఖ పరిధిలో 13,129 హెక్టార్లు,1,345.17వేల హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు నిర్ధారించారు. ఇందుకు గాను జిల్లా వ్యాప్తంగా 16,118 మంది రైతులకు రూ.21.46 కోట్ల నష్ట పరిహారం కింద చెల్లించాలని నివేదిక రూపొందించారు. వచ్చే నెలలో సంక్రాంతిలోపు పరిహారం సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. బాధిత రైతుల జాబితాలను ఈనెల 22వ తేదీ వరకు రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీలో భాగంగా ప్రదర్శించుతున్నారు. 26న తుది జాబితా అధికారికంగా వెల్లడిస్తారు.

ఉచితంగా పశుగ్రాసం

జిల్లా వ్యాప్తంగా తుపాను ప్రభావం అధికంగా ఉన్న 24 గ్రామాల పరిధిలో రైతులకు పశుగ్రాసం ఇబ్బంది లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పశు పోషణపై ఆధార పడిన రైతులను ఆదుకునేందుకు ఉచితంగా పశుగ్రాసం సరఫరా చేస్తోంది. కిలో రూ.15.90 పైసలుండే పశు దాణాను రైతుకు గరిష్ఠంగా వందకిలోల వరకు ఉచితంగా సరఫరా చేశారు. ఇందుకోసం జిల్లాకు రూ.23.70లక్షల విలువైన 150 టన్నుల పశు గ్రాసాన్ని ప్రభుత్వం సరఫరా చేసింది. రాజానగరం నియోజకవర్గం పరిధిలో సీతానగరం మండలం 25 టన్నులు, రాజమహేంద్రవరం రూరల్,నిడదవోలు నియోజకవరాల్లో లోతట్టు ప్రాంతాల్లో ఇబ్బందులు పడుతున్న రైతుల్ని గుర్తించి 25 టన్నులు చొప్పున పశుగ్రాసం అందజేశారు. కొవ్వూరు నియోజక వర్గంలోని చాగల్లు, తాళ్లపూడి, కొవ్వూరు మండలాలకు చెందిన పాడిరైతులకు 75 టన్నుల పశు గ్రాసం అందించారు. జిల్లా వ్యాప్తంగా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. 1,756 పశువులకు ఉచిత వైద్య సేవలు అందించారు. వ్యాధుల బారిన పడకుండా వివిధ రకాల వాక్సిన్లు,మందు లు ఉచితంగా అందజేశారు.

పంట నష్ట పరిహారం కింద అందించనున్న సాయం: రూ.21.46 కోట్లు
సబ్సిడీ విత్తనాలపై ప్రభుత్వం రాయితీ: రూ.35.64లక్షలు
ఇళ్లు దెబ్బతిన్న వారికి ఇచ్చిన మొత్తం: రూ.17.30లక్షలు
ముంపు బాధితులకు బియ్యం: 17.50 టన్నులు
120 ముంపు తక్షణ ఆర్థిక సహాయం : రూ.3లక్షలు
పశు దాణా పంపిణీకి వెచ్చించిన మొత్తం: రూ.23.70లక్షలు
విద్యుత్ పునరుద్ధరణకు అయిన వ్యయం: సుమారు రూ.50లక్షలు
జిల్లాలో తక్షణ సాయం నిమిత్తం ప్రభుత్వం చేసిన ఖర్చు మొత్తం రూ.22.93 కోట్లు

శరవేగంగా సాయం

- **రంగంపేట మండ**లంలో పంటలు దెబ్బతిన్న **శనగ రైతులకు 80 శా**తం సబ్సిడీపై 5.50 టన్నుల **విత్తనాలను సరఫరా** చేశారు.ఇందు కోసం **ప్రభుత్వం రూ.44**.50లక్షలు వెచ్చించింది. **రూ.35.64 లక్షల** భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం **భరిస్తుంది.**
- **ఎకరాకు నలభై** కిలోల చొప్పున రైతుకు గరి**ష్ఠంగా ఐదెకరాల ప**రిమితికి లోబడి విత్తనాలు **అందిస్తున్నారు.**
- **తుపాన్ ప్రభావం** తగ్గిన పదిహేను రోజుల లోగానే విత్తనాలు సరఫరా చేస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
- ఇళ్లు దెబ్బతిన్న 173 కుటుంబాలకు గుర్తించి తక్షణ సాయంగా రూ.10వేలు వంతున రూ.17.30 లక్షలు అందజేశారు.
- 700 మంది ముంపు బాధితులకు 25 కిలోల చొప్పున 17.50 టన్నుల బియ్యం అందించారు. కందిపప్పు, ఉల్లిపాయలు,బంగాళా దుంపలు, కిలో వంట నూనె చొప్పున ఏడేసి టన్నుల నిత్యావసరాలను తక్షణ సాయంగా అందజేశారు.
- ఏడు చోట్ల పునరావాసం కల్పించి కుటుంబానికి రూ.2,500 చొప్పున 120 కుటుంబాలకు సహాయం అందజేశారు.
- సింగిల్‌గా నివాసం ఉంటున్న పది మందికి రూ.1,000 వంతున అందించారు.
- 24 గంటలు తిరగకుండానే యుద్ధప్రాతిపదికన విద్యుత్ లైన్లను సరిచేసి సరఫరా పునరుద్ధరించగలిగారు.

సబ్సిడీపై విత్తనాలిచ్చారు



పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై విత్తనాలు అందించింది. గత నవంబరులో నలభై శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు కొనుగోలు చేసి ఐదు ఎకరాల్లో పంటవేశాను. భారీ వర్షాల కారణంగా పంట పూర్తిగా దెబ్బతింది. తుపాను తగ్గాక అధికారులు సర్వే చేశారు. ప్రస్తుతం అదను దాటకుండా సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేయడం చాలా ఊరట కలిగించింది.

-పోతుల బులివీర్రాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు, రంగంపేట

తక్షణ సాయం అందించడం హర్షణీయం



తుపాను వల్ల కురిసిన భారీ వర్షాలకు మా ప్రాంతం మునిగిపోయింది. వర్షపు నీరు మా ఇంటిని చుట్టిముట్టింది. ప్రభుత్వం తక్షణ సాయంగా రూ.2,500 అందించింది. ఇరవై ఐదుకిలోల బియ్యం,నిత్యావసర సరకులు అందజేసింది.గతంలో ఎప్పుడు ఇంత త్వరగా సాయం అందించిన దాఖాలాల్లేవు. సకాలంలో సాయం ఇవ్వడం మూలంగా మాలాంటి పేదలకు సాయం ఎంతో ఉపకరించింది.

-పసుపులేటి వెంకటలక్ష్మి, తాళ్లపూడి,

అంచనా పూర్తి



నష్ట పరిహారం లెక్కలు పూర్తయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఈనెల 22వ తేదీ వరకు సామాజిక తనిఖీలో భాగంగా అన్నీ ఆర్బీకేల్లో జాబితాలు ఉంచాం. 33శాతం కంటే ఎక్కువగా పంట నష్టపోయిన రైతుల పేర్లు అందులో ఉన్నాయి. 24న జిల్లా కలెక్టరుకు పంపిస్తాం. 26న తుది జాబితా ప్రకటిస్తాం. వ్యవసాయ శాఖ పరిధిలో రూ.18.16 కోట్ల మేర పంట నష్ట పరిహారం చెల్లించాల్సి ఉంది.

-ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



రాజానగరం మండలం నందరాడ గ్రామంలో మిచాంగ్ తుపానుకి దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు(ఫైల్)



తాళ్లపూడి మండలం ప్రక్కిలంకలో తుపాను బాధితులకు తక్షణ సాయంగా రూ.10వేలు, నిత్యవసరాలు అందజేస్తున్న హోమ్ మంత్రి తానేటి వనిత(ఫైల్)

నియోజకవర్గ ప్రగతికి రూ.2వేల కోట్ల వ్యయం

ఎమ్మెల్యే జి శ్రీనివాస్ నాయుడు

పెరవలి : సచివాలయం, వలంటీర్ వ్యవస్థల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు జగన్ సారథ్యంలోని తమ ప్రభుత్వం నేరుగా సంక్షేమ పథకాల ఫలాలను అందజేస్తోందని ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడు పేర్కొన్నారు. పెరవలి మండలం అన్నవరప్పాడులో మంగళవారం గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం జలజీవన్ మిషన్ పథకంలో పైప్‌లైన్ విస్తరణ, వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నవరప్పాడులో ఇప్పటివరకు రూ.5.45 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వివిధ పథకాల ద్వారా రూ.20.69 కోట్ల లబ్ది చేకూర్చామన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో నియోజక వర్గంలో అభివృద్ధి, సంక్షేమానికి రూ.2 వేల కోట్లు వెచ్చించామన్నారు. ఇంతటి అభివృద్ధి గతంలో ఏ ప్రభుత్వమైనా చేసిందా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో నాడు-నేడు, రోడ్లు, భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, డ్రైయిన్లు వంటి అభివృద్ధి పనులకు రూ.670 కోట్లు ఖర్చు చేశామన్నారు. రూ.1350 కోట్లు సంక్షేమం కోసం ఖర్చు చేశామని వివరించారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ప్రతి గ్రామంలో ఓహెచ్ఆర్ ట్యాంకుల నిర్మాణానికి రూ.72 కోట్లు ఖర్చు చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. టీడీపీ పాలనలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుతో పాటు టీడీపీ నాయకులు మాఫియాగా తయారై మట్టి, ఇసుక దోచుకున్నారని విమర్శించారు. పేదలకు సెంటు భూమి కూడా ఇవ్వని పార్టీ టీడీపీ అని మండిపడ్డారు. కులం, మతం, పార్టీ చూడకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వీరమళ్ళ సత్యనారాయణ, సర్పంచ్ పంత బాల సుందరి, సొసైటీ అధ్యక్షులు పంతం నాగేశ్వర రావు, వైఎస్సార్ సిపి గ్రామ అధ్యక్షులు పంతం సత్యనారాయణ (చిన్న),ఉప సర్పంచ్ పులపర్తి శక్తి ప్రసాద్, నాయకులు కోటిపల్లి రాంబాబు, వేండ్ర కృష్ణమూర్తి, రంగినీడి శ్రీనివాస్, కేశవ తదితరులు పాల్గొన్నారు.



అన్నవరప్పాడు గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జి శ్రీనివాస్ నాయుడు

వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీల నియామకం

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో జిల్లా అనుబంధ కమిటీలను పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ప్రకటించింది.

జిల్లా వికలాంగుల విభాగం అధ్యక్షుడిగా ముత్యాల పోసికుమార్ (రాజమహేంద్రవరం రూరల్), జనరల్ సెక్రటరీలుగా సత్యవాడ కార్తిక్ (కొవ్వూరు), కొవ్వూరి ఆదిరెడ్డి (అనపర్తి), సెక్రటరీలుగా నూతంగి ఉమా మహేశ్వరి (నిడదవోలు), సనమండ్ర వెంకటేశ్వర్లు (కొవ్వూరు), ఉయ్యూరు జోషిబాబు (కొవ్వూరు), పులగం వెంకట రెడ్డి (అనపర్తి), పూసల వెంకటేశ్వరరావు (అనపర్తి), జాయింట్ సెక్రటరీలుగా సాలి లీలావతి (కొవ్వూరు), కర్రింకి రామ దుర్గారావు (కొవ్వూరు), సుంకర సత్యనారాయణ (కొవ్వూరు), మద్దుకూరి కృష్ణ (కొవ్వూరు), సుందరపల్లి చిట్టిబాబు (అనపర్తి), కర్రి సూర్రెడ్డి (అనపర్తి) ఎంపికయ్యారు.

జిల్లా వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కమిటీ

జిల్లా అధ్యక్షుడిగా ముద్దాల తిరుపతిరావు (అను) (రాజమహేంద్రవరం రూరల్), జనరల్ సెక్రటరీగా గొర్రిపూడి శ్రీనివాసరావు (అనపర్తి), సెక్రటరీలుగా నేతునూరి శ్రీనివాస్ (అనపర్తి), మట్టా శ్రీనివాస్(అనపర్తి), సందం రమేష్ (కొవ్వూరు), చేటపల్లి శ్రీనివాస్ (కొవ్వూరు), జాయింట్ సెక్రటరీలుగా విసరపల్లి శ్రీను (అనపర్తి), గొల్లపల్లి శ్రీను (అనపర్తి), పోలిశెట్టి సర్వేశ్వరరావు (కొవ్వూరు), కనుమూరి తిరుపతిరాజు (కొవ్వూరు), కప్పాల సురేంద్ర (కొవ్వూరు) నియమితులయ్యారు.



రుడా చైర్ పర్సన్‌గా షర్మిలారెడ్డి



షర్మిలారెడ్డి

సాక్షి, రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) చైర్ పర్సన్‌గా మేడపాటి షర్మిలారెడ్డి నియమితులయ్యారు. ఆ పదవిని రెండోసారి ఆమెకు కేటాయిస్తూ ప్రభుత్వ కార్యదర్శి ధనుంజయరెడ్డి ఉత్తర్వులు వెలువరించారు. రుడా శాఖ ప్రారంభం సమయంలో చైర్ పర్సన్‌గా ఎన్నికైన ఆమె రెండేళ్ల పాటు పదవిలో కొనసాగారు. తాజాగా మరోసారి పొడిగించారు. రెండేళ్ల కాలంలో తూర్పు, కోనసీమ జిల్లాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడమే కాకుండా పూర్తి చేశారు. తనకు తిరిగి పదవి అప్పగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, సహకరించిన నాయకులకు షర్మిలారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలు మరింత విస్తృతం చేసి, ప్రభుత్వంపై ప్రజలకు మంచి భావన వచ్చేలా కృషి చేస్తానన్నారు.

ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులు కీలకం

- కలెక్టర్ మాధవీలత
- జీఎస్‌ఎల్‌లో శిక్షణ కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

రాజానగరం: ఎన్నికల కమిషన్ ఆదేశాల అమలు, ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలోని ఆడిటోరియంలో మంగళవారం జిల్లా పరిధిలోని సెక్టోరల్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన ఉండాలని, అప్పుడే సమర్థంగా విధులు నిర్వహించగలుగుతారన్నారు. ప్రతి ప్రిసైడింగ్ అధికారికి అందుబాటులో ఉంటూ, వారికి అవసరమైన సలహాలు, సూచనలిస్తూ ఎన్నికలు సజావుగా జరిగేలా బాధ్యత వహించాలన్నారు. అనంతరం సెక్టారల్ అధికారుల విధులపై బుక్‌లెట్లు అందించారు. ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలోని 175 సెక్టార్లలో అధికారులను, పోలీసు అధికారులను నియమిస్తున్నామన్నారు. ఎన్నికల బాధ్యత, పోలింగ్ స్టేషన్లు, పోలింగ్ రోజున బాధ్యతలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై సమగ్ర సమాచారంతో పాటు అవగాహన ఉండాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ మాట్లాడుతూ పోలింగ్ ప్రారంభమైన మొదటి, రెండు గంటలలోనే మీ సెక్టారు పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లను సందర్శించి, ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పోల్ ప్రారంభ నివేదికను అందజేయాలన్నారు. సమావేశంలో రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గ ఈఆర్వో, కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో జి.నరసింహులు, నియోజకవర్గాల ఎన్నికల అధికారులు ఏ.చైత్రవర్షిణి (రాజానగరం), ఏబీపీఎస్పీ శ్రీనివాస్ (అనపర్తి), కృష్ణనాయక్ (కొవ్వూరు), ఎం.ఝాన్సీరాణి (నిడదవోలు), ఎస్.సరళావందనం (రాజమండ్రి రూరల్), ఎం.వెంకటసుధాకర్ (గోపాలపురం), సహాయ ఈఆర్వోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పశువైద్యం.. ఇక క్షణాల్లో సాధ్యం

- పశువులకు ఆరోగ్య కార్డులు
- పక్కాగా అందనున్న వైద్యసేవలు
- జిల్లాలో 30,681 కార్డుల జారీ

జిల్లాలో జారీ చేసిన కార్డులు

డివిజన్	లక్ష్యం	పంపిణీ చేసిన కార్డులు
రాజమహేంద్ర వరం డివిజన్	44,110	17,567
కొవ్వూరు డివిజన్	38,116	13,114
మొత్తం	82,226	30,681



పశుఆరోగ్య సంరక్షణ కార్డులను అందజేస్తున్న హోంమంత్రి తానేటి వనిత(ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: పశువైద్యం మరింత సులభ రీతిలో జరిగేలా, మూగజీవాలకు వైద్యసేవలు పక్కాగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పశువుల ఆరోగ్య సంరక్షణకు ఆరోగ్య కార్డులు జారీ చేస్తోంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పశువుల సంఖ్య, వాటికి కావాల్సిన మందులు ఇతర అంశాలకు ఉపయోగపడేందుకు అటు ప్రభుత్వం, ఇటు రైతుకు ఉపయోగపడే గుర్తింపు కార్డు ఇది. అన్ని పశువుల వివరాలు ఆన్‌లైన్ చేసి హోలోగ్రామ్‌తో కూడిన పది అంకెల సంఖ్యలో పొందుపరిచి గుర్తింపు ఇస్తున్నారు. ఈ హలోగ్రామ్‌ను స్కాన్ చేసినప్పుడు ఆ నంబర్‌తో ఎన్ని జీవాలు ఉన్నాయి, రైతు ఎవరు, ఎలాంటి వ్యాధులు ఉన్నాయి వంటి వివరాలన్నీ తెలుస్తాయి. పశువైద్యశాఖ అధికారులు ప్రతి పశువుకు కార్డు ఇవ్వకుండా ఆరు పశువులకు (పెద్ద జీవాలు) ఒక ఆరోగ్య గుర్తింపు కార్డును తయారు చేసి ఇస్తున్నారు. ఇక మేకలు / గొర్రెలు అయితే 20 జీవాలకు ఒక ఆరోగ్య కార్డు అందిస్తున్నారు. ప్రధానంగా ఇందులో అనేక రకాల సమాచారం పొందుపరిచి ఉంచుతున్నారు. ఒకప్పుడు పొడవాటి కరపత్రంలా ఉన్నా, ప్రస్తుతం పశువైద్యశాఖ అధికారులు దాన్ని తగ్గించి హ్యాండ్‌బుక్ వంటి ఆకారంలో ప్రింట్ చేసి ఉచితంగా అందిస్తున్నారు.ఆర్బీకేలు, పశువైద్యశాల సిబ్బంది వీటిని రిజిస్టర్ చేస్తున్నారు.

ఉపయోగాలివే..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశుసంవర్ధకశాఖ తరఫున రెండు రకాల యానిమల్ హెల్త్ (పశు ఆరోగ్య సంరక్షణ)కార్డులను జారీ చేస్తోంది. అందులో ఒకటి పశుఆరోగ్య సంరక్షణ కార్డు. ఇది ఆరు గేదెలు / ఆవులు / పోతులకు మాత్రమే వర్తిస్తుంది. రెండోది గొర్రెలు / మేకల ఆరోగ్య సంరక్షణ కార్డు. ఇది సుమారు 20 జీవాలకు వర్తిస్తుంది. ఇందులో పశువులను పోషించే పశుపోషకుడి వివరాలు, పశుసంపద వివరాలు ఉంటాయి. వ్యాధుల నుంచి టీకాల వరకు సమస్త సమాచారం లభిస్తుంది. మూగజీవాలకు ఏవైనా అనారోగ్య సమస్యలు ఉంటే ఈ కార్డుతో చికిత్స అందించడం సులభమవుతుంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 82,226 కార్డులు జారీ కాగా, 30,681 కార్డులను పాడి రైతులకు అందించారు.

ఇబ్బందులు తప్పాయి



పశు ఆరోగ్య సంరక్షణ కార్డు ఎంతో ఉపయోగపడుతుంది. పశువులు, గొర్రెలు, మేకలకు వైద్యం, వైద్యుల వివరాలు తెలుసుకునే వీలు కలుగుతుంది. వీటిని రైతులందరికీ పంపిణీ చేస్తున్నారు. అన్ని సేవలూ ఉచితంగా పొందుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పాడి రైతులకు ఇబ్బందులు తప్పాయి.

- కొండేటి హేమలత, పాడిరైతు, రాజమహేంద్రవరం

ఎంతో ఉపయోగం



జిల్లాలోని పాడి రైతులు, గొర్రెల పెంపకం దారులందరూ పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు పొందాలి. ఇవి ఆర్‌బీకేలోనూ, పశు వైద్యసిబ్బంది రిజిస్ట్రేషన్ చేస్తారు. హలోగ్రామ్‌తో కూడిన గుర్తింపు కార్డు ప్రతి రైతు వద్ద ఉంటే పశుగణన, వ్యాధుల నిర్ధారణ, ప్రభుత్వం అందించే మందులు, టీకా వివరాలు, పశుబీమా.. ఇలా అన్నింటికీ ఉపయోగపడుతుంది.

- డాక్టర్ ఎస్‌టీజీ సత్యగోవింద్, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి

పేదల ఆరోగ్య పరిరక్షణే సీఎం జగన్ లక్ష్యం

- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితి ఐదింతలకు పెంపు
- మంత్రి మేరుగు నాగార్జున
- నల్లజర్లలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి నాగార్జున, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: పేదల ఆరోగ్య పరిరక్షణే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. ఈ దిశలోనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తోందని చెప్పారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావుతో కలసి నల్లజర్ల సచివాలయం వద్ద కొత్త ఫీచర్లతో కూడిన ఆరోగ్యశ్రీ కార్డులను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తోందన్నారు. ఇప్పటి వరకూ రూ.5 లక్షలుగా ఉన్న ఆరోగ్యశ్రీ చికిత్స ఖర్చు పరిమితిని రూ.25 లక్షలకు పెంచిందని తెలిపారు. ఈ పథకం కింద మన రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల్లోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం దాదాపు 3,200 జబ్బులకు ఉచిత వైద్యం పొందే అవకాశం కల్పించిందని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా కింద ప్రభుత్వం ఏటా రూ.4,100 కోట్లు పైగా ఖర్చు చేస్తోందని తెలిపారు. నాడు–నేడు కింద ప్రభుత్వాసుపత్రులను ఆధునీకరించిందని, వైద్య, పారా మెడికల్ సిబ్బందితో పాటు సూపర్ స్పెషాలిటీ వైద్యులను నియమించిందని చెప్పారు. ప్రతి జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల, రీసెర్చి సెంటర్లను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పటికే ఉన్న 11 వైద్య కళాశాలల ఆధునీకరణ, కొత్తగా మరో 17 కళాశాలల నిర్మాణానికి రూ.32,279 కోట్లు ఖర్చు చేస్తోందని మంత్రి నాగార్జున వివరించారు.

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ, వైద్యం కోసం పేదలు అప్పుల పాలు కాకూడదనే ఉద్దేశంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ చికిత్స పరిమితిని రూ.25 లక్షలకు పెంచారని అన్నారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ సమయంలో లబ్ధిదారులకు అన్ని విషయాలూ వివరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లి జ్యోతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, ఎంపీడీఓ రాజశేఖర్, వైద్యులు గంగాధరరావు, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

22న మండపేటలో సామాజిక సాధికార బస్సు యాత్ర

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వెల్లడి
- సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమని పునరుద్ఘాటన



బస్సు యాత్ర వివరాలను వెల్లడిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సాధికారతకు చేసిన అభివృద్ధిని వివరించేందుకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సు యాత్ర ఈ నెల 22న మండపేటలో జరగనుంది. పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఈ విషయం వెల్లడించారు. మండపేటలోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ పాలనలోనే రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధ్యమైందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమమే అందుకు నిదర్శనమని అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల వారికి నేరుగా రూ.2.38 లక్షల కోట్ల మేర లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రభుత్వ సాయాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేయడం ద్వారా పూర్తి పారదర్శక పాలనను అందిస్తున్నారన్నారు. ఇది సామాజిక న్యాయానికి దారి తీస్తుందని చెప్పారు.

మండపేటలో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నామని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చెప్పారు. 22వ తేదీ సాయంత్రం 3 గంటలకు పట్టణంలోని పెద్దకాలువ వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహానికి నేతలు పూలమాల వేసిన అనంతరం, సామాజిక సాధికార బస్సు యాత్ర పట్టణ ప్రధాన రహదారిలోకి ప్రవేశిస్తుందని తెలిపారు. పట్టణ వీధుల్లో యాత్ర సాగిన అనంతరం 4 గంటలకు కలువ పువ్వు సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఈ యాత్రలో రాష్ట్ర మంత్రులు పినిపే విశ్వరూప్, జోగి రమేష్, కారుమూరు వెంకట నాగేశ్వరరావు, ఎంపీలు చింతా అనురాధ, పిల్లి సుభాష్‌చంద్రబోస్, నందిగం సురేష్, మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, పండుల రవీంద్రబాబు పాల్గొంటారని వివరించారు.

సామాజిక సాధికార బస్సు యాత్రకు రాష్ట్ర వ్యాప్తంగా విశేష ప్రజాదరణ లభిస్తోందని, మండపేట నియోజకవర్గంలో కూడా ప్రజా మద్దతుతో ఈ యాత్ర విజయవంతమవుతుందని అన్నారు. దీనికోసం పార్టీ శ్రేణులు విశేషంగా కృషి చేస్తున్నాయని ఎమ్మెల్సీ తోట చెప్పారు. విలేకర్ల సమావేశంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ, వైఎస్సార్ సీపీ కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎస్సీ, బీసీ నాయకులు మేడిశెట్టి దుర్గారావు, ముమ్మిడివరపు బాపిరాజు, తుపాకుల ప్రసన్న కుమార్, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు కురుపూడి భవాని, కౌన్సిల్‌లో విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్, పార్టీ రూరల్ కన్వీనర్ పిల్లా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు, రేపు జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈఓ అబ్రహం

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక శ్రీ సత్యసాయి గురుకులంలో బుధ, గురువారాల్లో జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సైన్స్ ఫెయిర్‌కు హాజరయ్యే ఏ ఒక్కరికీ ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా చూడాలని ఆదేశించారు. ప్రొటోకాల్ ప్రకారం కార్యక్రమాలన్నీ ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ రిజిస్ట్రేషన్ జరుగుతుందని, ఆలోగా విద్యార్థులు తమ ఎగ్జిబిట్స్, యూనిఫాంతో హాజరు కావాలని సూచించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఉన్న పాఠశాలల వారు కూడా తమ ప్రాజెక్టును ప్రదర్శించాలని, ఎవ్వరికీ ఎటువంటి మినహాయింపూ లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యా శాఖాధికారి ఈవీబీఎన్ నారాయణ, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్, రూరల్ ఎంఈఓ అయ్యంకి దుర్గా తులసీదాస్, గురుకులం కరస్పాండెంట్ శ్యామ్‌సుందర్, ప్రిన్సిపాల్ జి.గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ డ్రైవర్ సజీవ దహనం

కాకినాడ రూరల్: వాకలపూడి ఇండస్ట్రియల్ ఏరియాలో మంగళవారం ఓ వ్యాన్ డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. సర్పవరం ఎస్సై బాలాజీ కథనం ప్రకారం.. సామర్లకోట మండలం పవర గ్రామానికి చెందిన సూరత్ బాలరాజు (64) వ్యాన్ యజమాని, డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. వాకలపూడి ఇండస్ట్రియల్ ప్రాంతంలోని సంతోషిమాత ఆయిల్ రిఫైనరీ నుంచి లోడింగ్ కోసం ఏడీబీ రోడ్డు మీదుగా ఓఎన్‌జీసీ దాటి వస్తుండగా ఉదయం 9 గంటల సమయంలో ఉన్నట్టుండి వ్యాన్‌లో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్థానికులు దగ్గరకు వెళ్లి చూడగా క్యాబిన్ డోర్ ఓపెన్ అవ్వలేదు. బలవంతంగా తెరవగా అప్పటికే బాలరాజు సజీవదహనమయ్యాడు. షార్ట్ సర్క్యూట్ కారణంగా వ్యాన్‌లో మంటలు రావడంతో డోర్ ఓపెన్ అవ్వక అతడు సజీవ దహనమై ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వ్యాన్‌ను, బాలరాజు మృతదేహాన్ని డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి పరిశీలించారు. మృతుడికి భార్య, కుమారుడు రమేష్, కుమార్తె ఉన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



చంద్రం (ఫైల్)

రాజానగరం: మండలంలోని పాలచర్లకు చెందిన 108 సంవత్సరాల వృద్ధురాలు వల్లభశెట్టి చంద్రం మంగళవారం మృతి చెందారు. ఆమె మనుమడు పిల్లా సత్య ఈ విషయం తెలిపారు. చంద్రానికి ఒక కుమార్తె. ఆమె వద్దనే ఆ వృద్ధురాలు ఉంటున్నారు. ఆమెకు మనుమలు, మునిమనుములు కూడా ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

ముమ్మిడివరం: విదేశం వెళ్లేందుకు భర్త నిరాకరించాడనే మనస్తాపంతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ముమ్మిడివరం బాలయోగి కాలువ గట్టు ప్రాంతానికి చెందిన కముజు లక్ష్మీ నీలిమ (34) జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి రెండేళ్ల క్రితం ఇండియాకు వచ్చింది. అప్పటి నుంచీ ఆమె, భర్త నాగరాజు ముమ్మిడివరంలోని ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల మళ్లీ గల్ఫ్ దేశాలకు వెళ్లేందుకు నీలిమ ప్రయత్నించగా, భర్త నాగరాజు నిరాకరించాడు. ఆమె పాస్‌పోర్టును సైతం సోమవారం కాల్చివేశాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన నీలిమ సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటి యజమాని అభ్యంతరం వ్యక్తం చేయడంతో లక్ష్మి మృతదేహాన్ని నాగరాజు తన స్వగ్రామం అప్పనపల్లికి తీసుకుని వెళ్లిపోయాడు. నీలిమ తల్లి మాణిక్యాలమ్మ ఫిర్యాదు మేరకు ముమ్మిడివరం ట్రైనీ డీఎస్పీ విష్ణుస్వరూప్ పర్యవేక్షణలో ఎస్సై ఎస్.శివప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'నవోదయ' హాల్ టిక్కెట్ల విడుదల

రాయవరం: జవహర్ నవోదయ సమితి విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశానికి వచ్చే నెల 20న జరగనున్న పరీక్షకు హాల్ టిక్కెట్లు విడుదలయ్యాయి. ఇప్పటికే దరఖాస్తు చేసిన విద్యార్థులు https://cbseitms.rcil.gov.in/nvs/AdminCard/AdminCard లింకును క్లిక్ చేయాలి. అనంతరం రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ ఎంటర్ చేస్తే హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

నూతన ఆవిష్కరణలకు హ్యాకథాన్ దోహదం



హ్యాకథాన్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

గండేపల్లి: భావి ఇంజనీర్ల ఆలోచనల నుంచి రూపు దిద్దుకునే నూతన ఆవిష్కరణలకు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమం దోహదపడుతుందని ఆదిత్య కళాశాలల డైరెక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ముఖ్య అతిథి ఏఐసీటీఈ ప్రతినిధి యుక్తి అంకుర సంస్థ వ్యవస్థాపకుడు ప్రణవ్ దీక్షిత్, గౌరవ అతిథి ఐ4సీ కంపెనీ మేనేజర్ సౌరభ్ ఉబాలే అన్నారు. సూరంపాలెం ఆదిత్య విద్యాసంస్థల్లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్–2023 గ్రాండ్ ఫినాలే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం 36 గంటల పాటు నిర్విరామంగా జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలకు పదును పెడుతూ నూతన ఆవిష్కరణలు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా భావి ఇంజనీర్ల ప్రతిభను వెలికి తీయడానికి ప్రధాని మోదీ ఈ వినూత్న కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. దేశం నలుమూలల నుంచీ 27 టీములు, 189 మంది సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎ.లక్ష్మణరావు, డీన్‌లు ఎస్.రమాశ్రీ, జేడీ వెంకటేష్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ ఢీకొని వ్యక్తి మృతి

పెరవలి: మోటార్ సైకిల్ ఢీకొనడంతో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెరవలి ఎస్సై ఎం.సూర్యభగవాన్ కథనం ప్రకారం.. మండలంలోని అన్నవరప్పాడు గ్రామానికి చెందిన గుత్తుల రామారావు (36) సోమవారం రాత్రి గుడికి వెళ్లి, తిరిగి ఇంటికి వస్తున్నాడు. అదే సమయంలో తణుకు నుంచి రావులపాలెం వైపు వెళ్తున్న మోటార్ సైకిల్ రామారావును వేగంగా ఢీకొట్టింది. దీంతో అతడు ఒక్క ఉదుటన రోడ్డుపై పడిపోయి, గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అక్కడకు వెళ్లి గమనించగా.. రామారావు చెవులు, ముక్కు నుంచి రక్తం కారుతూ గాయపడి కనిపించాడు. అతడిని హుటాహుటిన తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామారావు మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మోటార్ సైక్లిస్ట్ కూడా గాయపడ్డాడు. అతడు తణుకులో చికిత్స పొందుతున్నాడు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గ్రూప్–1, 2 పోస్టులకు ఉచిత శిక్షణ

- 22వ తేదీ తుది గడువు
- బీసీ సంక్షేమ అధికారి రాజేశ్వరి

కాకినాడ సిటీ: ఏపీపీఎస్సీ గ్రూప్–1, 2 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల ప్రిలిమినరీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం గ్రూప్–1లో 100, గ్రూప్–2 ఎగ్జిక్యూటివ్ 331, నాన్ ఎగ్జిక్యూటివ్ 566 పోస్టులకు ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించనుందని వివరించారు. వీటికి హాజరయ్యే బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రాజమహేంద్రవరంలో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. గ్రూప్–2 శిక్షణకు ఈ నెల 22వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపిక చేసిన 100 మంది అభ్యర్థులకు ఈ కేంద్రంలో ఈ నెల 27 నుంచి 50 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తారని రాజేశ్వరి తెలిపారు. అలాగే, గ్రూప్–1 అభ్యర్థులు ఈ నెల 31 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపిక చేసిన 60 మంది అభ్యర్థులకు వచ్చే నెల ఐదో తేదీ నుంచి 60 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తామని, దీంతోపాటు స్టైపెండ్, స్టడీ మెటీరియల్, బుక్ అలవెన్స్ అందిస్తారని తెలిపారు. డిగ్రీ మార్కుల్లో మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఈ ఉచిత శిక్షణకు కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. అభ్యర్థులు తమ పూర్తి బయోడేటాతో పాటు అన్ని విద్యార్హతల నకళ్లను, రూ.లక్ష లోపు ఆదాయం సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, రూ.10 పోస్టల్ స్టాంపులు అతికించిన సొంత చిరునామా గల కవరును దరఖాస్తుకు జత చేసి, ఈ నెల 26లోగా 'సంచాలకుడు, వెనుకబడిన తరగతుల అధ్యయన కేంద్రం, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల కాంపౌండ్, వై జంక్షన్ దగ్గర, రాజమహేంద్రవరం' అనే చిరునామాకు పంపాలని రాజేశ్వరి సూచించారు. ఇతర వివరాలకు స్టడీ సర్కిల్ డైరెక్టర్ పి.సత్యరమేష్‌ను సంప్రదించవచ్చన్నారు.

కన్నుల పండువగా రథోత్సవం





బిక్కవోలు గ్రామంలో సాగుతున్న కుమార సుబ్రహ్మణేశ్వరస్వామి రథయాత్ర   రథంపై కొలువుదీరిన స్వామి

బిక్కవోలు: షష్ఠి ఉత్సవాల్లో భాగంగా బిక్కవోలులో శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి రథోత్సవం మంగళవారం కన్నుల పండువగా జరిగింది. భారీగా తరలివచ్చిన భక్తులు, క్యూలో వేచి ఉండి స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు బ్యాండ్ మేళాలు, కోలాటాలు, డోలు, సన్నాయి, డప్పుల వాయిద్యాల సందడితో భారీ భక్త జనసందోహం కోలాహలం నడుమ రథోత్సవాన్ని ఉత్సవ కమిటీ చైర్మన్ డాక్టర్ జంగా మురళీకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఆలయం నుంచి జి.మామిడాడ రోడ్డు మీదుగా వెళ్లి, తిరిగి గ్రామంలోని ప్రధాన రోడ్ల మీదుగా ఈ రథోత్సవం సాగింది. అంతకుముందు సోమవారం రాత్రి స్వామి వారి గ్రామోత్సవం కూడా వైభవంగా నిర్వహించారు. రాత్రి 11 గంటల నుంచి కళ్లు మిరుమిట్లు గొలిపేలా కాల్చిన బాణసంచా వేలాదిగా తరలివచ్చిన భక్తులను ఆకట్టుకుంది. సర్పం, విజిల్స్, ఈతచెట్టు, కలర్స్ ఈతచెట్టు, జపాన్ రింగ్, మల్లె పందిరి, సూర్యచక్రం, బ్యాటరీ బాక్సులు, రకరకాల తారాజువ్వలు తదితర వెరైటీలను ఈ పోటీల్లో ప్రదర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాదరెడ్డి, బిక్కవోలు శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో సీఆర్‌పీఎఫ్ జవాను మృతి

- హంసవరంలో విషాదఛాయలు
- నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



కిరణ్ కుమార్ (పాత చిత్రం)

తుని రూరల్: సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ జవానుగా జమ్మూలో విధులు నిర్వహిస్తున్న తంతటి కిరణ్ కుమార్ (41) సోమవారం బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. తుని మండలం హంసవరం గ్రామం ఆయన స్వస్థలం. కిరణ్‌కుమార్ మృతి సమాచారం తెలియడంతో ఆయన భార్య విజయకుమారి, సోదరుడు రవికుమార్ హుటాహుటిన జమ్మూ వెళ్లారు. వారికి కిరణ్ కుమార్ పార్థివ దేహాన్ని సీఆర్‌పీఎఫ్ అధికారులు శ్రీనగర్ ఎయిర్‌పోర్టులో అప్పగించారు. భర్త మృతదేహాన్ని చూసి విజయకుమారి కన్నీరు మున్నీరుగా విలపించారు. రాత్రికి విశాఖపట్నానికి చేరుకుని తెల్లవారుజామున మృతదేహాన్ని గ్రామానికి తీసుకువస్తామని బంధువులు తెలిపారు. కిరణ్‌కుమార్ మృతదేహానికి బుధవారం ఉదయం అధికార లాంఛనాలతో అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కిరణ్ కుమార్‌కు భార్యతో పాటు కుమారుడు జతిన్ (12), కుమార్తె మెర్సీ (10), తల్లిదండ్రులు జాన్, భాగ్యవతి ఉన్నారు.



శ్రీనగర్ ఎయిర్‌పోర్టులో భర్త పార్థివ దేహం వద్ద విలపిస్తున్న విజయకుమారి

దేశ సేవలో ఇద్దరు కుమారులు

హంసవరం గ్రామానికి చెందిన జాన్, భాగ్యవతి దంపతులకు ముగ్గురు కుమారులు. మొదటి కుమారుడు గ్రామంలో వ్యవసాయ పనులు చేస్తుండగా రెండో కుమారుడైన కిరణ్ కుమార్ 2005లో సీఆర్‌పీఎఫ్‌లో చేరారు. మూడో కుమారుడు రవికుమార్ ఆర్మీలో చేరాడు. ఇద్దరు కొడుకులు దేశ రక్షణలో సేవలు అందిస్తుండటం తమ కుటుంబానికి ఎంతో సంతోషాన్నిచ్చిందని, కిరణ్ కుమార్ మృతి పుత్రశోకాన్ని మిగిల్చిందని తల్లిదండ్రులు బోరున విలపించారు. కిరణ్ కుమార్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయన కుటుంబ సభ్యులను సర్పంచ్ రాయి మేరీ అవినాష్ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైనతేయ నదిలో వృద్ధురాలి మృతి

పి.గన్నవరం: స్థానిక పాత అక్విడెక్టు వద్ద వైనతేయ గోదావరి నదీపాయలో మునిగి ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఎస్సై హరికోటి శాస్త్రి కథనం ప్రకారం.. వాడ్రేవుపల్లికి చెందిన దొమ్మేటి సత్యనారాయణమ్మ (69) తన కుమారుడు శ్రీనివాస్ వద్ద ఉంటోంది. మూడు రోజుల క్రితం తన చెల్లెలు ఇంటికి తీసుకువెళ్లమని కుమారుడిని అడిగింది. అతడు తీసుకువెళ్లకపోవడంతో మనస్తాపానికి గురై, సోమవారం ఉదయం వాడ్రేవుపల్లి నుంచి పి.గన్నవరం వచ్చింది. మధ్యాహ్నం వైనతేయ నదిలో స్నానం చేస్తూ గల్లంతైంది. ఆమె మృతదేహం మంగళవారం ఉదయం లభ్యమైంది.

మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

TO-LET

■ ముమ్మిడివరం మెయిన్ సెంటర్ నేషనల్ హైవేకు అనుకుని 15 సెంట్లులో 2000 Sft విశాలమైన ఓపెన్ స్లాబ్ బిల్డింగ్, గొడౌన్స్, షోరూమ్స్, మాల్స్‌కు అద్దెకు. సంప్ర॥ 96765 53767 [R- 1151430]

Services

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో ఋణాలు, సిబిల్ అవసరం లేదు. NPA కూడా ధరఖాస్తు. డాల్ఫిన్ ఫైనాన్స్, రాజన్, సెల్: 8437924006. [W-788967]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 G

TOURS & TRAVELS

■ నర్మదానది పుష్కరాలకు రైలు యాత్ర. 3.5.24 తేది. 6రోజులు. టికెట్ 1కి 9000/-. 14రోజులు. టికెట్ 1కి 22500/-. వివరాలకు సంప్ర: కె.వాసు. నెల్లూరు. 94913 40504. [MA-22963]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Wanted

■ విజయవాడలో ఇంటి దగ్గరేవుండి పేషెంట్స్‌లను / పెద్దవారిని చూసుకొనుటకు అనుభవం ఉన్న M/F కేర్ టేకర్స్ / నర్సులు కావలెను. రూమ్ + భోజనం + మంచి జీతం. ✆ 91608 35559, 78158 35561 [B-516]

■ రాజమండ్రి, తణుకు, నిడదవోలులో ప్ర॥ కం, ATM's, స్టార్ హోటల్, షోరూమ్ నందు సెక్యూరిటీ గార్డ్స్, సె॥ సూపర్‌వైజర్స్ జీ॥ 12 to 15 వేలు. రూం+లో, రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, రాజమండ్రి. ✆ : 93922 69369 [R-218]

■ హైదరాబాద్‌లోని ఆప్తా హోంకేర్‌లో వృద్ధులను చూసుకోవడానికి 21-45 వయసు గల M/F Caretakers కావలెను.జీతం॥18-20వేలు, భోజనం, వసతి, ఇన్సూరెన్సు కలవు. 9381848549 [G-1624]

■ హైదా కాలేజీ, పటవల యందు పని చేయుటకు హాస్టల్ వార్డెన్ (M/F) కావలెను. భోజనం, వసతి కలదు. వివరాలకు ఫోన్ : 8331040530 [HA-7543]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9160900024/ 9640400073 [H-793666]

■ పనిమనుషులు (ఆడవారు) కావలెను. ఇంట్లోనే ఉండిపోవాలి. వంట, ఇంటిపనులు, పిల్లల్ని చూసు కోవాలి. వయస్సు : 20-40. అనుభవం తప్ప నిసరి. మంచి జీతం. హైదరాబాద్ : 94945 30992 [V-2308]

■ కన్సల్టెన్సీ కాదు.VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ : 15000 -40000, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. 9014885406 [HA-993]

LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

LIC HFL LIC HOUSING FINANCE LTD

బ్యాక్ ఆఫీస్, 4వ అంతస్తు, ఉత్తర విభాగం, జీవన్ సమృద్ధి, న్యూ ఇన్వెస్ట్‌మెంట్ భవనం, ఎల్ఐసి ఎనెక్స్ భవనం, తిక్కన్న రోడ్డు, విశాఖపట్నం-530004. ఫోన్ నెం.0891-2746480

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకులకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తులు ఎల్.ఐ.సి. హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (LIC HFL) అధీకృత అధికారిగా దిగువ సంతకందారు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖా పెట్టిన ఆస్తి/ఆస్తుల ఈ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలాగే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతిపై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీత పేరు : శ్రీ ఎస్. బాబు రావు, నివాసం దగ్గరలో గల డోర్ నెం.3-232, ఆర్.ఎస్.నెం.244, భవానిపురం వెనుక వైపున, కాతేరు గ్రామం, రాజమహేంద్రవరం.

లోన్ ఖాతా నెంబరు : 711500005526, ఏరియా ఆఫీస్ : విశాఖపట్నం, సంప్రదించవలసిన నెం.80081 77199

ఆస్తుల చిరునామా మరియు ఫ్లాట్ ప్రదేశము / భూమి యొక్క యు.డి.ఎస్ : రాజమండ్రి రూరల్, పిడింగొయ్య ఎస్.ఆర్.ఓ., కాతేరు గ్రామము మరియు గ్రామ పంచాయితీ, భవానిపురం యొక్క వెనుక వైపున, ఆర్.ఎస్.నెం.244 ప్రకారం 150 చ॥గ॥లు విస్తీర్ణంలోని దక్షిణం వైపున ఆర్‌సిసి భవనంతో పాటు ప్లాటు నెం.11 తో ఉన్న ఆస్తి కంపెని వారి నుండి పొందిన ఋణము తిరిగి చెల్లింపు కొరకు హామీగా ఋణగ్రహీత యొక్క హక్కు దస్తావేజు నెం.234/2016 తేది.04.01.2016 ప్రకారం మా వద్ద జమచేసి యావత్తు ఆస్తి సమాన నిష్పత్తిలో తనఖా ఉంచిన ఆస్తి. హద్దులు : తూర్పు : మంతెన ప్రకాశరాజు గారికి చెందిన ప్లాట్ నెం.14, దక్షిణం : ప్లాట్ నెం.10 స్థలం, పడమర : రోడ్డు, ఉత్తరం : బి. సూరిబాబు గారికి చెందిన మిగిలిన స్థలం.

బ్యాంక్ వివరములు (ధరావత్తు బదిలీ చేయవలసిన) : Account Number : HFLESEVWVI05526
IFSC Code : UTIB0CCH274, Property Id : SEVWVI05526

రిజర్వు ధర : రూ.23,50,000/-, ధరావత్తు (రిజర్వు ధరలో 10%) రూ.2,35,000/-, బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం యొక్క వెబ్‌సైట్	https://www.bankeauctions.com
ఆస్తి తనిఖీ కొరకు తేదీ & సమయం	26.12.2023 ఉ॥ 11.00 గం॥ల నుండి 3.00 గం॥ల మధ్యన
బిడ్‌దరు / సీల్డ్ బిడ్ సమర్పించుటకు చివరి తేది	05.01.2024 సా॥ 05.00 గం॥ల లోపు (ఆన్‌లైన్ విధానం ద్వారా మాత్రమే)
ఇ-వేలం తేది	06.01.2024 ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 3.00 గం॥ల వరకు (with auto extension)

ఇ-వేలం ద్వారా విక్రయం చేయు పైన చెప్పబడిన అసెట్స్ / ఆస్తి (సర్ఫేసి, చట్టం 2002 నందు నియమములు మరియు నిబంధనలకు లోబడి మరియు తదుపరి చెప్పిన నిబంధనలు) కొరకు జారీ చేసిన ఈ బహిరంగ ప్రకటనతో పాటుగా, ఎల్.ఐ.సి. హెచ్.ఎఫ్.ఎల్ వారు సీల్డ్ కవరు/లు లేదా ఆన్‌లైన్ విధానం ద్వారా పైన చెప్పబడిన ఆస్తులను "ఎక్కడ ఏమి ఉన్నదో అలాగే" మరియు "అక్కడ ఏమి ఉన్నదో అదే" ప్రాతిపదిక పై కొనుగోలు చేయుటకు ఆసక్తి గల బిడ్డర్ల నుండి ఆఫర్లను ఆహ్వానించుచున్నారు.

వేలం ద్వారా విక్రయం యొక్క నియమములు & నిబంధనలు ఈ దిగువ చెప్పబడినవి

1) "ఎక్కడ ఏమి ఉన్నదో అలాగే", "అక్కడ ఏమి ఉన్నదో అదే", "ఏదైతే ఉన్నదో అదే" మరియు "ప్రశ్నించ వీలులేని", ప్రాతిపదిక పై మాత్రమే ఇ-వేలం నిర్వహించబడును మరియు "ఆన్‌లైన్" విధానము ద్వారా ఇ-వేలం ఎల్.ఐ.సి హౌసింగ్ ఫైనాన్స్ వారిచే ఆమోదిత ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ మెస్సర్స్ సి1 ఇండియా ప్రై లి., వారిచే నిర్వహించబడును.
2) ఆసక్తి గల బిడ్డర్లు తమ పేర్లను దయచేసి మా పోర్టల్ https://bankeauctions.com నందు నమోదు చేసుకొనవలెను మరియు వారి యొక్క యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను ఉచితముగా పొందవచ్చును. ఇ-వేలం విధానం ద్వారా పాల్గొనుటకు ఆన్‌లైన్ శిక్షణ కొరకు ఆసక్తి గల అర్హత కలిగిన బిడ్డర్లు మా సర్వీసు ప్రొవైడరు మెస్సర్స్ సి1 ఇండియా ప్రై లి., సంప్రదించగలరు. సంప్రదించు వ్యక్తి : శ్రీ భరత్ కృష్ణ, ఫోన్ నెం.99481 82222, ఇ-మెయిల్ : andhra@c1india.com.
3) ఆమోదిత ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ "మెస్సర్స్ సి1 ఇండియా ప్రై లి"., at https://bankeauctions.com. వారి వెబ్‌సైట్ దర్శించి వేలం ద్వారా విక్రయం చేయు ఆస్తి యొక్క పూర్తి వివరములు మరియు ఇందలి పూర్తి నియమములు మరియు నిబంధనలు తెలుసుకొనవచ్చును.
4) ఇతర వివరములకు కొరకు సంప్రదించుటకు ఫోన్ నెం : 93922 22077

తేది : 19.12.2023, ప్రదేశం : విశాఖపట్నం   సం/-అధీకృత అధికారి, ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్